



# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

శుక్రవారం,
జూలై 3, 2026

సంపుటి : 10 సంచిక :14 రంగారెడ్డి ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ పేజీలు 8 వెల 4/-


## అంగన్వాడీల సంక్షేమమే తమ ప్రాధాన్యత అని మంత్రి సీతక్క వెల్లడి



- స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడిన అంగన్వాడీలకు తెలంగాణ సర్కార్ గుడ్ న్యూస్!
- వారి స్థానంలో కొత్త నియామకాలు జరగకపోతే తిరిగి విధుల్లోకి అవకాశం
- వేలాది మంది కార్యకర్తలు, సహాయకులకు లభించిన భరోసా

2లో

## ఆ ఎమ్మెల్యేల కోసం సీఎం విజయ్ 'షాపింగ్' చేస్తున్నారు: స్టాలిన్ ఎద్దేవా



- విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వం బీజేపీకి జిరాక్స్ కాపీ అని ఎద్దేవా
- అన్నాడీఎంకే ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తూ ప్రతిపక్షాన్ని బలహీనపరుస్తున్నారని ఆగ్రహం
- టీవీకే కార్యకర్తల నుంచి మహిళలకు రక్షణ కల్పించాలన్న స్టాలిన్
- ప్రభుత్వాన్ని కూల్చే ఉద్దేశం తమకు లేదని స్పష్టీకరణ

2లో

## కూటమి ప్రభుత్వం విజయోత్సవాలు జరుపుకోవడం సిగ్గుచేటు: వైఎస్ షర్మిల



- సూపర్ సిక్స్ అట్టర్ ఫ్లాప్ అయిందన్న షర్మిల
- అప్పులు చేయడంలో ప్రభుత్వం రికార్డులు సృష్టిస్తోందని ఎద్దేవా
- పాలన అంతా మాయాబజార్ లా కనిపిస్తోందని విమర్శ

# 'జీ రామ్ జీ'పై సుప్రీంకోర్టుకు రాష్ట్రం

- కొత్త ఉపాధి చట్టం అమలుకు కేబినెట్ ఆమోదం
- నిబంధనలపై న్యాయపోరాటం, పార్లమెంట్‌లోనూ నిరసనకు నిర్ణయం
- టిమ్స్ ఆస్పత్రులకు 6,278 ఉద్యోగాలు.. మూసీ తొలి దశకు 7,345 కోట్ల ఆమోదం
- ఉపాధ్యాయులకు కూడా అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకం
- గోదాములు, నవోదయ--కేంద్రీయ విద్యాలయాలకు భూముల కేటాయింపు



హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'వికసిత్ భారత్–గ్యారంటీ ఫర్ రోజ్‌గార్, ఆజీవికా మిషన్–గ్రామీణ్ (వీబీ–జీ రామ్ జీ)' చట్టాన్ని రాష్ట్రంలో అమలు చేయడానికి తెలంగాణ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అయితే ఈ చట్టంలోని కొన్ని నిబంధనలు సమాఖ్య వ్యవస్థ, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నాయనే అభిప్రాయంతో వాటిని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించాలని కూడా నిర్ణయించింది. ఈ అంశాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించి కేంద్ర ప్రభుత్వ వైఖరిపై నిరసన వ్యక్తం చేయాలని మంత్రివర్గం తీర్మానించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో ఉపాధి చట్టంతో పాటు పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. సమావేశం అనంతరం

(మిగతా 2వ పేజీలో)








# చర్చకు సవాల్.. రాజకీయ రగడకు తెర

- అప్పులు, అవినీతి ఆరోపణలపై కాంగ్రెస్--భారాస మధ్య మాటల యుద్ధం
- గన్‌పార్క్, తెలంగాణ భవన్‌ల వద్ద ఉద్రిక్త వాతావరణం
- చర్చకు వస్తామని ప్రకటించిన ఇరుపక్షాలు.. మధ్యలో పోలీసుల అడ్డుకట్ట
- హరీశ్‌రావు అదుపులోకి.. కేటీఆర్‌కు గన్‌పార్క్ వెళ్లకుండా నిరోధం
- అసెంబ్లీలోనే తేల్చుకుందామంటూ అధికార, ప్రతిపక్షాల పరస్పర సవాళ్లు

హైదరాబాద్: రాష్ట్ర రాజకీయాల్లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష భారాస మధ్య సవాళ్లు--ప్రతిసవాళ్లు గురువారం తీవ్ర ఉత్కంఠకు దారితీశాయి. గురుకులాల కొనుగోళ్లలో అవినీతి జరిగిందన్న ఆరోపణలు, గత ప్రభుత్వ అప్పులపై కొనసాగుతున్న విమర్శలు రెండు పార్టీల మధ్య రాజకీయ వాతావరణాన్ని మరింత వేడెక్కించాయి. ఒకరినొకరు బహిరంగ చర్చకు ఆహ్వానించుకున్నప్పటికీ, ఆ చర్చ జరగకముందే గన్‌పార్క్, తెలంగాణ భవన్ పరిసరాలు రాజకీయ ప్రకటనలు, ఆరోపణలు, పోలీసుల జోక్యంతో ఉద్రిక్తంగా మారాయి. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పాలనను, గత భారాస ప్రభుత్వ పనితీరును ప్రజల ముందే పోల్చి చర్చించేందుకు సిద్ధమని ప్రకటించగా, భారాస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అప్పుల గణాంకాలపై బహిరంగ చర్చకు తాము కూడా సిద్ధమేనని ప్రతిస్పందించారు. ఇదే సమయంలో గురుకుల విద్యాసంస్థల్లో యూనిఫాంలు, విద్యా కిట్ల కొనుగోళ్లలో భారీ అవినీతి జరిగిందని మాజీ మంత్రి హరీశ్‌రావు, పార్టీ నేత ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ ఆరోపిస్తూ ప్రభుత్వానికి సవాల్ విసిరారు. దీనికి స్పందించిన కాంగ్రెస్ నేతలు చర్చకు ఎలాంటి అభ్యంతరం లేదని ప్రకటించారు. ఈ నేపథ్యంలో మంత్రులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పొన్నం ప్రభాకర్, మహమ్మద్ అజహరుద్దీన్ గన్‌పార్క్‌కు చేరుకుని

(మిగతా 2వ పేజీలో)

# కేబినెట్‌లో మూసీపై మంతనాలు

- మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుపై మంత్రివర్గంలో సుదీర్ఘ చర్చ
- నీటి వనరులు, వ్యయ--ప్రయోజనాలపై ఉత్తమ్ ప్రశ్నలు
- ప్రాజెక్టు అవసరాన్ని వివరించిన సీఎం రేవంత్‌రెడ్డి
- సాగునీటి ప్రాజెక్టుల సవరించిన అంచనాలపై ఫైళ్ల జాప్యంపై అసంతృప్తి
- జులై 17 కేబినెట్‌లో ప్రత్యేక ఎజెండాగా సమగ్ర సమీక్షకు నిర్ణయం



హైదరాబాద్: రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు, సాగునీటి ప్రాజెక్టుల సవరించిన అంచనాలు ప్రధాన చర్చాంశాలుగా నిలిచాయి. మూసీ ప్రాజెక్టు తొలి దశకు పరిపాలనా అనుమతుల అంశంపై చర్చ సందర్భంగా పలువురు మంత్రులు సాంకేతిక, ఆర్థిక అంశాలను ప్రస్తావించగా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాజెక్టు లక్ష్యాలు, అవసరాన్ని వివరిస్తూ సందేహాలకు సమాధానాలు ఇచ్చినట్లు సమాచారం. మూసీ నదిలోకి అవసరమైన నీటి వనరులు

(మిగతా 2వ పేజీలో)



# భారత్-జపాన్ బంధానికి కొత్త ఊపు

- సనాయె తకాయిచికి ప్రధాని మోదీ ఆత్మీయ స్వాగతం
- 'నా చిట్టి చెల్లి' అంటూ ప్రత్యేకంగా సంబోధించిన ప్రధాని
- వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని ఉభయ దేశాల నిర్ణయం
- రక్షణ, సాంకేతికత, పెట్టుబడులపై కీలక చర్చలు

న్యూఢిల్లీ: భారత్–జపాన్ సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా జరిగిన వార్షిక ద్వైపాక్షిక శిఖరాగ్ర

(మిగతా 2వ పేజీలో)

# ముంబయిలో రెండోరోజూ కుండపోత.. పలు ప్రాంతాలు జలమయం

- రవాణా వ్యవస్థపై తీవ్ర ప్రభావం.. విమాన సర్వీసుల్లో అంతరాయం
- మూడు రాష్ట్రాల్లో వర్ష బీభత్సానికి తొమ్మిది మంది మృతి
- పలుచోట్ల హెచ్చరికలు.. విద్యాసంస్థలకు సెలవులు

న్యూఢిల్లీ/ముంబయి: దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు చురుగ్గా కొనసాగుతుండటంతో పలు రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా మహారాష్ట్ర రాజధాని ముంబయిలో వరుసగా రెండోరోజూ కుండపోత వర్షం కురవడంతో జనజీవనం తీవ్రంగా దెబ్బతింది. నగరంలోని అనేక ప్రాంతాలు నీటమునగగా, రహదారులపై ట్రాఫిక్ నిలిచిపోయింది. ప్రతికూల వాతావరణం కారణంగా కొన్ని విమానాల రాకపోకలు కూడా ప్రభావితమయ్యాయి. గత 24 గంటల్లో ముంబయి, ఠాణె, పాల్ఘర్‌తో పాటు ముంబయి మెట్రోపాలిటన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షపాతం నమోదైంది. పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని



(మిగతా 2వ పేజీలో)

## పట్టుదలతో పని చేస్తున్న సర్ ఇన్చార్జిలను అభినందించిన -- కేఎల్ఆర్



వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూలై 02 :- మహేశ్వరం నియోజకవర్గంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ ప్రక్రియను ప్రతిరోజూ సమీక్షిస్తూ, సర్ ఇన్చార్జిలతో రెండో రోజు నిర్వహించిన జూమ్ సమావేశంలో మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి ( పాల్గొన్నారు ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ, సర్ కు సంబంధించిన జాబితాలు, ఓటర్ల మ్యాపింగ్, ఫారాల పురోగతి తదితర అంశాలను ప్రతిరోజూ క్షుణ్ణంగా సమీక్షిస్తున్నామని తెలిపారు. ప్రతి ఓటు అమూల్యమైనదని, కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లు పూర్తి క్రమశిక్షణతో పనిచేస్తూ పార్టీ ఓటర్ల హక్కులను పరిరక్షించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో బూత్ ఇన్చార్జ్లు, బి ఎల్ ఏ లు మరియు , బి ఎల్ ఏఇన్చార్జ్లు సమన్వయంతో అత్యంత సమర్థవంతంగా పనిచేస్తున్నారని, ముఖ్యంగా రంగారెడ్డి జిల్లాలో మహేశ్వరం నియోజకవర్గం ఆదర్శంగా నిలుస్తోందని కేఎల్ఆర్ అభినందించారు. ఇదే పట్టుదలతో సర్ కార్యక్రమాన్ని కొనసాగిస్తూ, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక్క ఓటు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.మహేశ్వరం నియోజకవర్గంలోని ప్రతి బూత్లో కాంగ్రెస్ శ్రేణులు సమన్వయంతో పనిచేసి, అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో కొనసాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కేఎల్ఆర్ పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యం లో ఓటు హక్కు అత్యంత విలువైనదని, దానిని పరిరక్షించడం ప్రతి కార్యకర్త బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.



## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం లో పాల్గొన్న ఎమ్మెల్యే

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జులై 2

జగిత్యాల జిల్లా రాయికల్ మండలశీ మహితపూర్ గ్రామానికి చెందిన పాలడుగు స్వప్న అంజయ్య ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమానికి హాజరై శుభాకాంక్షలు తెలిపి చీర కానుకగా అందజేసిన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్.వెంట మాజీ ఏఎంసీ చైర్మన్ గన్నేరాజిరెడ్డి, కోల శ్రీనివాస్, గంప ఆనందం, మహేందర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



## ఓటరు జాబితాలో ఉన్న సవరణ ప్రక్రియను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలి

### ---బిఎల్ వో భవాని, గిరి, మనోహర్

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూలై 02 :-

ఎల్బీనగర్ నియోజకవర్గం హస్తినాపురం డివిజన్ నందనవనం కాలనీలో తెలంగాణ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్ ప్రక్రియ లొ భాగంగా గురువారం బిఎల్ఓ లు భవాని గిరి మనోహర్ లు నందనవనం కాలనీలో ఇంటింటికి తిరుగుతూ ఎన్యూమరేషన్ ఫార్మ్ ను అందజేయడం జరిగినది వారి వెంట బి ఎల్ ఎ నరేష్ విష్ణు రాజు గౌడ్ పాల్గొని మాట్లాడుతూ సర్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో ఉన్న సవరణ ప్రక్రియను అందరూ ఉపయోగించుకోవాలని ఓటర్ జాబితాలో ఉన్న పేరు మార్పులను మరియు చిరునామా మార్పులను అన్ని క్షుణ్ణంగా పరిశీలించి చూసుకోవాలని బిఎల్ఓ ఆఫీసర్లకు సహకరించాలని కోరారు



## చర్చలకు పిలిచి అక్రమ అరెస్టులా..?

### ---హరీష్ రావుకు సంఘీభావం తెలిపిన సబితా ఇంద్రారెడ్డి

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూలై 02 :- చర్చల పేరుతో బీఆర్ఎస్ నాయకులను పిలిచి అక్రమ అరెస్టులకు పాల్పడిన రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండిస్తూ, మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కంచన్బాగ్ పోలీస్ స్టేషన్కు చేరుకొని మాజీ మంత్రి హరీష్ రావు , ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ , జీవన్ రెడ్డి నిలి మర్యాదపూర్వకంగా కలిసి సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ తీరుపై ఆమె తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో విభిన్న అభిప్రాయాలను అణిచివేసే చర్యలు తగవని, చర్చలకు ఆహ్వానించి అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్చార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి తో పాటు మహేశ్వరం నియోజకవర్గం నలుమూలల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చిన పార్టీ నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొన్నారు.

# అనాథ విద్యార్థులకు ఆసరా.! కృష్ణ గోపాల్ సేవాసమితి

### - మోహిత్ -లీషా వివాహ వార్షికోత్సవం... అనాథ విద్యార్థుల్లో ఆనందోత్సవం.!



వార్త మిర్రర్ తెలంగాణ స్టేట్ బ్యూరో

కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో అనాథ పాఠశాల విద్యార్థులకు ఉదయం అల్పాహార



కార్యక్రమాన్ని నిర్వహించారు. మోహిత్ దాగా- లీషా దాగా వారి వివాహ వార్షికోత్సవం సందర్భంగా వారి వివాహ మహోత్సవాన్ని అనాథ పాఠశాల విద్యార్థుల సమక్షంలో డాక్టర్ కపిల్ కుమార్ అగర్వాల్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వారికి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ కపిల్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ శ్రీకృష్ణ పరమాత్మ వారి దాంపత్య జీవితం సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో అష్ట ఐశ్వర్యాలతో జీవించాలని అనాథలకై, నిరుపేదలకై సేవాభావాన్ని పెంపొందించుకొని మరిన్ని కార్యక్రమాలు వారు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కృష్ణ గోపాల్ సేవా సమితి అధికారులు సభ్యులు పాల్గొన్నారు

# హైదరాబాద్ మెట్రోకు కొత్త దారి.. కేంద్ర-రాష్ట్రాల ఉమ్మడి అడుగులు

పేర్కొన్నారు. కేంద్ర మంత్రి కిషన్రెడ్డి కూడా చర్చలు సానుకూల వాతావరణంలో జరిగాయని వెల్లడించారు. తెలంగాణ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కేంద్రంతో సమన్వయంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఇక మెట్రో ఫేజ్-1కు సంబంధించి రుణ వ్యవహారాలపై కూడా కొత్త పరిణామాలు చోటుచేసుకున్నాయి. ప్రాజెక్టులో ఈక్విటీ షేర్ కొనుగోలుకు రూ.1,461.47 కోట్లు, అప్పుల రీఫైనాన్సింగ్కు రూ.13,538.53 కోట్లు కలిపి మొత్తం రూ.15 వేల కోట్ల నిధుల సమీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్సీ)తో చర్చలు జరిపింది. అయితే నిర్ణయించిన గడువులోగా మొదటి విడత రుణం విడుదల కాకపోవడంతో అనిశ్చితి నెలకొంది. ఈ నేపథ్యంలో తాజాగా జరిగిన సమావేశంలో ముందుగా మెట్రో ఫేజ్-1 వాస్తవ విలువను అంచనా వేయాలని నిర్ణయించారు. ఎస్బీఐ క్యాప్స్ నివేదిక ఆధారంగా రుణదాత సంస్థను ఎంపిక చేయనున్నారు. భవిష్యత్తులో ఐఆర్ఎఫ్సీ నుంచి రుణం తీసుకోవాలా లేదా ఇతర ఆర్థిక సంస్థలను ఎంపిక చేయాలా అన్న అంశంపై కేంద్రం, రాష్ట్రం సంయుక్తంగా నిర్ణయం తీసుకోనున్నాయి. దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ--ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) నమూనాలో నిర్మితమైన హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టు 2017లో ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. ఎల్అండ్టీ సంస్థ నిర్మాణం, నిర్వహణ చేపట్టిన ఈ ప్రాజెక్టు కోవిడ్ అనంతరం ఎదురైన ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో కొత్త నిర్వహణ నమూనా అవసరమైంది. ఈ ఏడాది ఏప్రిల్లో తెలంగాణ ప్రభుత్వం మెట్రో ఫేజ్--1ను తన ఆధీనంలోకి తీసుకుంది. ఇప్పుడీ ప్రాజెక్టును జైపూర్ నమూనాలో కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి భాగస్వామ్యంతో నిర్వహించే అవకాశాలు కనిపిస్తున్నాయి. జైపూర్లో మెట్రో వ్యవస్థ ప్రారంభంలో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనసాగినా, తరువాత కేంద్ర మెట్రో విధానానికి అనుగుణంగా కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త సంస్థగా మారింది. ప్రస్తుతం అక్కడ ఫేజ్--2 విస్తరణ పనులు



50:50 భాగస్వామ్యంతో కొనసాగుతున్నాయి. హైదరాబాద్లో కూడా అదే తరహా నమూనా అమలైతే మెట్రో విస్తరణకు అవసరమైన నిధులు, సాంకేతిక సహకారం, పరిపాలనా సమన్వయం మరింత బలోపేతం కానున్నాయి. నగర రవాణా వ్యవస్థను మరింత విస్తరించేందుకు, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మెట్రో నెట్వర్క్ను అభివృద్ధి చేయడానికి ఈ నిర్ణయాలు కీలక మలుపుగా మారనున్నాయని అధికారులు భావిస్తున్నారు.

# ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని పెంచాలి

ఎన్.ఉత్తమ్కుమార్రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం ఢిల్లీలో కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రల్హాద్ జోషిని కలిసి తెలంగాణ రైతుల తరఫున వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో పెరుగుతున్న ధాన్యం ఉత్పత్తి, రైతుల అవసరాలు, నిల్వ మరియు మిల్లింగ్ సమస్యలపై కేంద్రానికి సమగ్ర వివరాలు అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి ఉత్తమ్కుమార్రెడ్డి, రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. కనీస మద్దతు ధరకు ఒక్క గింజ కూడా నష్టపోకుండా కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర అందేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని చెప్పారు. దేశంలోనే అత్యధిక స్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు 80.09 లక్షల మెట్రిక్ టన్నుల వరిని సేకరించిందని, కొనుగోలు ప్రక్రియ ఇంకా కొనసాగుతోందని ఉత్తమ్ వెల్లడించారు. ఖరీఫ్, రబీ సీజన్లను కలిపి 2025--26 మార్కెటింగ్ సంవత్సరంలో తెలంగాణలో 152 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా వరి సేకరణ జరిగి చారిత్రాత్మక రికార్డు నమోదైందన్నారు. రైతులు భారీగా వరి సాగు చేసి అధిక దిగుబడులు సాధిస్తున్న నేపథ్యంలో కేంద్రం కూడా వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. రబీ 2025--26 సీజన్కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం 90 లక్షల మెట్రిక్ టన్నుల వరి సేకరణ అంచనాలను సమర్పించినప్పటికీ, కేంద్రం కేవలం 35 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే లక్ష్యంగా నిర్ణయించిందని ఆయన తెలిపారు. ఇది సుమారు 51.47 లక్షల మెట్రిక్ టన్నుల వరికి సమానమని చెప్పారు. గత మూడు సీజన్లలో కేంద్రం నిర్దేశించిన లక్ష్యాలకు మించి రాష్ట్రం 69.50 లక్షల మెట్రిక్ టన్నుల వరిని అదనంగా కొనుగోలు చేయాల్సి వచ్చిందని వివరించారు. ఈ కారణంగా రాష్ట్ర ఖజానాపై రూ.16,446 కోట్ల అదనపు భారం పడిందని పేర్కొన్నారు. ధాన్యం సేకరణతో పాటు సీఎంఆర్ సరఫరా విషయంలోనూ రాష్ట్రం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గోదాముల కొరత, ఒకేసారి పలు సీజన్ల కొనుగోళ్లు కొనసాగడం, మిల్లింగ్ సామర్థ్యాలపై పెరుగుతున్న ఒత్తిడి కారణంగా సీఎంఆర్ సరఫరా గడువులను పొడిగించడం అత్యవసరమని వివరించారు. రబీ 2024--25 సీజన్కు సంబంధించిన సీఎంఆర్ సరఫరా గడువును మరో 60 రోజులు, ఖరీఫ్ 2025--26 సీజన్కు సంబంధించిన గడువును 120 రోజులు పొడిగించాలని



కేంద్రాన్ని కోరారు. అదేవిధంగా రబీ 2025--26 సీజన్కు కేంద్రం నిర్ణయించిన 35 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరణ లక్ష్యాన్ని 54.50 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో రబీ సీజన్లో పండే వరి ప్రధానంగా ఉప్పుడు బియ్యం తయారీకి అనుకూలంగా ఉండటంతో బాయిల్డ్ రైస్ రూపంలో సరఫరా చేసేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. రాబోయే ఖరీఫ్ 2026--27 సీజన్కు సంబంధించి కూడా రాష్ట్ర ప్రభుత్వం సమర్పించే అంచనాల ఆధారంగానే సేకరణ లక్ష్యాలను నిర్ణయించాలని కేంద్రానికి సూచించారు. రైతుల ప్రయోజనాల విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఎప్పటికీ రాజీపడదని ఉత్తమ్కుమార్రెడ్డి స్పష్టం చేశారు. రైతులు పండించిన ప్రతి గింజకు కనీస మద్దతు ధర లభించేలా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ధాన్యం కొనుగోలు, నిల్వ, మిల్లింగ్, సరఫరా ప్రక్రియలను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కేంద్రం కూడా రాష్ట్ర పరిస్థితులను అర్థం చేసుకుని సానుకూల నిర్ణయాలు తీసుకుంటే రైతులకు మరింత భరోసా కలుగుతుందని అభిప్రాయపడ్డారు.

## తెలుగు రాష్ట్రాల్లో ఈ నెలాఖరు వరకు విస్తారంగా భారీ వర్షాలు

**30వ తేదీ వరకు తేలికపాటి నుంచి మోస్తరు, భారీ వర్షాలు**

**తెలంగాణలో 5 డిగ్రీల వరకు తగ్గనున్న ఉష్ణోగ్రతలు**

**నేడు కోస్తాంధ్రలో, 28-30 మధ్య దక్షిణ కోస్తాలో భారీ వర్షాలు**


**తెలంగాణలోని 8 జిల్లాలకు ఎల్లో అలెర్ట్**

ఎండలు, ఉక్కపోతలతో ఇబ్బంది పడుతున్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రజలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తీపి కబురు అందించింది. రాబోయే వారం రోజుల పాటు (జూన్ 30 వరకు) రెండు రాష్ట్రాలలోనూ నైరుతి రుతుపవనాల ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తాయని అమరావతి, హైదరాబాద్ వాతావరణ కేంద్రాలు వెల్లడించాయి. ఈ కాలంలో అనేక ప్రాంతాలలో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉండగా.. కొన్ని జిల్లాలలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు, గంటకు 30 నుండి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ఈ విస్తారమైన వర్షాల కారణంగా రాబోయే రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 2 నుండి 5 డిగ్రీల సెల్సియస్ వరకు తగ్గే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే.. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఉభయ గోదావరి జిల్లాలతో కూడిన ఉత్తర కోస్తా ప్రాంతాలలో నేడు (24న) అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. 29, 30 తేదీలలో ఇక్కడ వర్షాల తీవ్రత మరింత పెరగొచ్చని అంచనా వేస్తున్నారు. కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు

## ప్రజాకేంద్రీకృత పరిపాలనే అభివృద్ధికి పునాది

మంత్రిత్వ శాఖల్లో సహాయ కార్యదర్శులుగా నియమితులైన 2024 బ్యాచ్కు చెందిన 183 మంది ఐఏఎస్ అధికారులతో మంగళవారం జరిగిన సమావేశంలో ప్రధాని ఈ సందేశాన్ని ఇచ్చారు. పరిపాలన అనేది కేవలం ఫైళ్లు, గణాంకాలు లేదా అధికారిక ప్రక్రియలకే పరిమితం కాదని, ప్రతి ఫైలు వెనుక ప్రజల ఆశలు, ఆందోళనలు, భవిష్యత్తు దాగి ఉంటుందని మోదీ పేర్కొన్నారు. అధికారుల ముందుకు వచ్చే ప్రతి దస్త్రం అనేక మంది పౌరుల జీవితాలను ప్రభావితం చేస్తుందని గుర్తుంచుకోవాలని సూచించారు. అందువల్ల తీసుకునే ప్రతి నిర్ణయంలో ప్రజా ప్రయోజనాలు ప్రధాన ప్రమాణంగా ఉండాలని చెప్పారు. సహానుభూతి, సమయోచిత స్పందన, కలుపుగోలుతనం వంటి లక్షణాలు పరిపాలనలో అత్యంత కీలకమని ప్రధాని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను అర్థం చేసుకుని త్వరితగతిన పరిష్కారాలు అందించగలిగితేనే పరిపాలనపై విశ్వాసం పెరుగుతుందని అన్నారు. ప్రభుత్వ విధానాల అమలు కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ప్రజలకు ప్రయోజనం చేకూర్చేలా ఉండాలని సూచించారు. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించాలన్న సంకల్పాన్ని మరోసారి ప్రస్తావించిన ప్రధాని, రాబోయే దశాబ్దాల్లో తీసుకునే విధానపరమైన మరియు పరిపాలనా నిర్ణయాలు దేశ భవిష్యత్తును నిర్ణయిస్తాయని చెప్పారు. ప్రతి అధికారి తన బాధ్యతలను జాతీయ అభివృద్ధి దృక్పథంతో నిర్వర్తించాలని కోరారు. పరిపాలనలో నాణ్యత, పారదర్శకత, ప్రజా భాగస్వామ్యాన్ని పెంపొందించడం ద్వారా అభివృద్ధి వేగవంతం అవుతుందని వివరించారు. డేటాను కేవలం సంఖ్యల సమాహారంగా చూడకూడదని మోదీ సూచించారు. ప్రతి గణాంకం వెనుక ప్రజల జీవన పరిస్థితులు, సవాళ్లు, ఆకాంక్షలు దాగి ఉంటాయని గుర్తించాలని చెప్పారు.

# మేడ్చల్ డిపిఆర్ఓ పై ఐ అండ్ పి ఆర్ కమిషనర్ కు ఫిర్యాదు





మేడ్చల్ జిల్లా ప్రతినిధి, వార్త మిర్రర్ ,జూలై 01 :
మేడ్చల్ మల్కాజిగిరి డిపిఆర్ఓ స్వర్ణలత విలేకరుల పట్ల కక్ష సాధింపు చర్యలపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం జిల్లాకు చెందిన పలువురు జర్నలిస్టులు సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ ముకుంద రెడ్డి, జాయింట్ డైరెక్టర్ జగన్ లకు ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా అక్రిడిటేషన్ కమిటీ విషయంలో, అక్రిడిటేషన్ల జారీ విషయంలో ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదుల పేర్కొన్నారు. అక్రిడిటేషన్ కమిటీ నియామకంలో ఒక సామాజిక వర్గానికి, ఒక యూనియన్ కు అధిక ప్రాధాన్యతనిస్తూ కమిటీని నియమించారని వివరించారు. కమిటీ నియామకంపై అనేక దినపత్రికలలో వార్తా కథనాలు ప్రచురితమయ్యాయని వారు తెలిపారు. ఈ విషయంలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అదే విధంగా అక్రిడిటేషన్ కార్డుల జారీ విషయంలో విలేకరులపై కక్ష సాధింపు చర్యలతో పాటు దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. లేనిపోని నిబంధనల పేరుతో జర్నలిస్టులను కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారని, ప్రభుత్వ ఉత్తర్వులు 252 ప్రకారమే "అర్హత ఉన్న పత్రికలు మాత్రమే వారి ప్రతినిధులను అక్రిడిటేషన్ల కోసం దరఖాస్తు చేయించారని వారు అన్నారు. ఇలాంటి వారికి సైతం అక్రిడిటేషన్ల ఇవ్వడంలో తీవ్ర జాప్యం చేస్తూ అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఇప్పటికే మంజూరైన అక్రిడిటేషలను సైతం ఇవ్వకపోవడం విచారకరమన్నారు. బస్సు పాసులను సైతం అప్రూవ్ చేయకుండా కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నారని వారు వివరించారు. కనీస పరిజ్ఞానం లేకుండా పత్రికలకు ప్రకటనలు జారీ చేయడం వల్ల జర్నలిస్టులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. తన లోపాలను ఎత్తి చూపిన వారిపై ద్వేషం పెంచుకొని కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నారని వారు వివరించారు. రాష్ట్ర రాజధాని హైదరాబాదు సమీపంలోని అతిపెద్ద జిల్లాకు సమర్ధులైన డిపిఆర్ఓ ను నియమిస్తే ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు మరింత ప్రచారం లభించే అవకాశం ఉంటుందన్నారు. ఈ విషయాలపై విచారణ జరిపి డిపిఆర్ఓ పై తగిన చర్యలు తీసుకోవాలని జర్నలిస్టులు కోరారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ యూనియన్ నాయకులు మెరుగు చంద్రమోహన్, బెలిదే అశోక్ గుప్తా, ముత్యం ముఖేష్ గౌడ్, వాసు కుమార్, వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్ డిపిఆర్ఓ కార్యాలయంలో గందరగోళం

**జర్నలిస్టులకు ఇబ్బందులు**
**అక్రిడేషన్ కార్డుల జారీలో జాప్యం**
**విధులపై అవగాహన లేని డిపిఆర్ఓ**



మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూలై 01 (వార్త మిర్రర్): ఉమ్మడి రాష్ట్రం నుంచే ప్రత్యేక గుర్తింపు పొందిన మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో సమాచార శాఖ పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారి (డిపిఆర్ఓ) స్వర్ణలత వ్యవహార శైలితో జర్నలిస్టులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన సమాచారం సకాలంలో అందకపోవడం, జిల్లాలో జరుగుతున్న అధికారిక కార్యక్రమాల వివరాలు అందించడంలో జాప్యంతో పాటు తప్పుల తడక తో సమాచారాన్ని అందజేస్తుంటారు. వివిధ శాఖల నుంచి వచ్చే ప్రెస్ నోట్ లను యధావిధిగా గ్రూపుల్లో వేయడం పట్ల జర్నలిస్టులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. జర్నలిస్టులకు, డిపిఆర్ఓ కు మధ్య సమన్వయంలో లోపాలు ఉండటం వల్ల అధికారులతో పాటు మీడియా ప్రతినిధులు కూడా ఇబ్బందులు పడుతున్నట్లు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్ల విరామం తర్వాత జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు మంజూరు చేసినప్పటికీ, మేడ్చల్ జిల్లాలో కార్డుల పంపిణీ మాత్రం కుంటి సాకులతో ఆలస్యమవుతోందని జర్నలిస్టులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, కొన్ని న్యూస్ ఏజెన్సీలకు మాత్రం త్వరితగతిన అక్రిడేషన్ కార్డులు అందించారని, మిగతా అర్హులైన జర్నలిస్టులను నిరీక్షణలో ఉంచారని ఆరోపిస్తున్నారు. జిల్లా పరిపాలన భవనంలోని పలు శాఖల అధికారులు సైతం సమాచార శాఖతో సమన్వయం లోపించడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సమాచారం. డిపిఆర్ఓ స్వర్ణలతతో పాటు కింది స్థాయి సిబ్బంది సైతం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. డిపిఆర్ఓ సెక్షన్ లో పనిచేస్తున్న పల్లవి సైతం తలా తోక లేని సమాధానాలతో మోనార్కుగా వ్యవహరిస్తోంది. యధా రాజా తథా ప్రజా అనడానికి పల్లవి పనితీరు నిదర్శనం. డిపిఆర్ఓ వ్యవహార శైలిపై ఇప్పటికే జిల్లా కలెక్టర్ తో పాటు సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ కు పలు ఫిర్యాదులు వెళ్లినట్లు తెలిసింది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ కు అతి సమీపంలో ఉన్న అతిపెద్ద జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల పట్ల సరైన ప్రచారం లేకపోవడంతో జిల్లా స్థాయిలో అన్ని విభాగాల అధికారులు అసంతృప్తితో ఉన్నారు. జిల్లా ప్రతిష్ఠకు తగిన విధంగా సమాచార శాఖ పనితీరు ఉండాలని, అక్రిడేషన్ కార్డుల పంపిణీలో పారదర్శకత పాటిస్తూ పెండింగ్‌లో ఉన్న కార్డులను వెంటనే అందజేయాలని జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. కొందరు జర్నలిస్టులు అక్రిడేషన్ ద్వారా అప్లై చేసుకున్న బస్సు పాస్ లను సైతం ఉద్దేశపూర్వకంగా అప్రూవల్ చేయకుండా డిపిఆర్ఓ పెండింగ్లో పెట్టారు. అప్రూవల్ పెండింగ్ లో ఉందని డిపిఆర్ఓ స్వర్ణలతను వాకప్ చేయగా మాకు సవాలక్ష పనులు ఉన్నాయి మా ఇష్టం వచ్చినప్పుడు చేస్తాం మీరు ఎవరు ప్రశ్నించడానికి అని సమాధానం ఇస్తున్నారు. జర్నలిస్టుల పట్ల ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న డిపిఆర్ఓ వివిధ శాఖలకు అందిస్తున్న సేవలను ఇట్టే అర్థం చేసుకోవచ్చు. డిపిఆర్ఓ స్వర్ణలతకు విధివిధానాలపై అవగాహన లేదని, తన ఇష్టానుసారంగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ డిపిఆర్ఓ విభాగానికే మచ్చ తెస్తున్నారని జర్నలిస్టు యూనియన్ల నాయకులు విమర్శిస్తున్నారు. డిపిఆర్ఓ స్వర్ణలతను విధుల నుంచి తప్పించి మేడ్చల్ జిల్లా ప్రతిష్టతను కాపాడాలని వారు కోరుతున్నారు.

# ముఖ్యమంత్రి తో కలిసి పనిచేసి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా

**- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్**
**- అంగన్వాడీ,మహిళా సమాఖ్య భవనాల శంకుస్థాపన**





వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జులై 2
జగిత్యాల జిల్లా రాయికల్ మండలం సింగారావుపేట గ్రామంలో 12 లక్షల నిధులతో అంగన్వాడీ నూతన భవనం, 10 లక్షలతో మహిళా సమాఖ్య భవనం, 10 లక్షల తో సీసీ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్. గ్రామానికి చెందిన మారంపల్లి మహేష్ ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరై శుభాకాంక్షలు తెలిపి చీర కానుకగా అందజేసిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఉన్న పాత బకాయిలు సర్పంచులకు, కాంట్రాక్టర్లకు చెల్లిస్తున్నాం. 3 ఎకరాల వరకు రైతులకు మొత్తం 4వేల కోట్ల రైతు భరోసా నిధులు మంజూరు చేయటం జరిగింది. మండలంలో అన్ని ఆలయాలకు నిధులు మంజూరు చేశా. సన్న బియ్యం ,200యూనిట్ల కరెంట్ ,మహిళ సమాఖ్య భవనాలు,గ్రామాల అభివృద్ధి, మహిళలకు బస్సులు, సోలార్ యూనిట్లు, అంగన్వాడీ పిల్లలకు యూనిఫారం లు, విద్యార్థులకు అల్పాహారం ఇలా అనేక గొప్ప కార్యక్రమం అమలు చేయడం జరిగింది. ముఖ్యమంత్రి తో కలిసి పనిచేసి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా. రైతులు కాలానికి అనుగుణంగా పంట మార్పిడి చేయాలి. జిల్లా కేంద్రంలో ఏటీసీ కేంద్రం, ఏర్పాటుతో యువతకు ఉపాధి అవకాశం. మహిళ డిగ్రీ కళాశాల లో నూతన కోర్సులు రావడం జరిగింది. మహిళలు హాస్పిటల్, ఫైనాన్స్ కోర్సులు చేయటం తో ఉపాధి అవకాశాలు లభిస్తాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బర్కశీ జయ-కృష్ణ మూర్తి, ఆత్మ చైర్మెన్ కాటిపెల్లి గంగారెడ్డి ఉప సర్పంచ్ గంగాధర్, ఎంపీవో సుష్మ, ఏఈ ప్రసాద్,సీడీపీఓ జయప్రద, మాజీ సర్పంచ్ రమణ రావు, గాజర్ల రవి గౌడ్, మాజీ ఎంపీపీ సంధ్యారాణి, సురేందర్ నాయక్ ,రవీందర్ రావు ,కోల శ్రీనివాస్, మహేందర్, గన్నే రాజి రెడ్డి, రమేష్, మండల సర్పంచులు, మహిళలు, నాయకులు, యువత, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యా వెలుగులు పంచుతున్న ప్రభుత్వ పాఠశాల

**--ప్రతి పేద విద్యార్థి కలలకు రెక్కలు ప్రభుత్వ బడి"**
**---జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె. ప్రమీల**






వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 01 : - ప్రభుత్వ పాఠశాలలు ఉత్తమ విద్యాసంస్థలని యాదాద్రి భువనగిరి జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె. ప్రమీల అన్నారు. పట్టుదలతో చదివి లక్ష్యంపై గురి పెట్టి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆమె సూచించారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాక, జనగాం గ్రామాల్లోని జడ్పీ ఉన్నత, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం హైదరాబాదుకు చెందిన రిలయబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 600 మంది విద్యార్థులకు సమకూర్చిన "స్టూడెంట్స్ కిట్" లను జిల్లా విద్యాశాఖ అధికారి బొల్లారం బిక్షపతితో కలిసి విద్యార్థులకు ఆమె పంపిణీ చేశారు అనంతరం .విద్య ప్రాముఖ్యతను తెలిపే సాంస్కృతిక కార్యక్రమాలనువిద్యార్థులు ప్రదర్శించారు .ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రమీల మాట్లాడుతూ.. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదివానని తాను ఈ స్థానంలో ఉండడానికి అప్పట్లో తనకు పాఠాలు బోధించిన ప్రభుత్వ ఉపాధ్యాయుల గొప్పతనం అని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉన్నత విద్యార్హతలు అనుభవం ఉన్న ఉపాధ్యాయులు ఉంటారని తెలిపారు. విద్యార్థులు లక్ష్యంపై గురి పెట్టి పట్టుదలతో విద్యాభ్యాసం చేసి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ హాస్టల్లో ఉంటూ నవోదయ విద్యాలయంలో చదివిన తుపాకుల రవి, అతని మిత్రులు కలిసి రిలయబుల్ ట్రస్టును స్థాపించి వేల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సహాయం అందిస్తున్నందుకు ఆయనను అభినందించారు. దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.అనంతరం డిఈవో బిక్షపతి మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాల వృక్షం లాంటిదని ఎంతోమందికి ఆవాసం కల్పిస్తుందని జిల్లా విద్యాశాఖ అధికారి బొల్లారం బిక్షపతి తెలిపారు. ప్రైవేటుపై మోజుతో పిల్లలను అటువైపుపంపితే ప్రభుత్వ పాఠశాలలు మూతబడతాయని నిరుద్యోగులకు ఉపాధి లభించదని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సంస్థాన్ నారాయణపురం మండలంలోని అన్ని జడ్పీ ఉన్నత పాఠశాలల కు చెందిన 1139 మంది విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్స్,పాఠశాలలకు స్పోర్ట్స్ కిట్స్ ఉచితంగా అందజేసిన రిలయబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ తుపాకుల రవిని అభినందించి సన్మానించారు. రిలయబుల్ ట్రస్టీ తుపాకుల రవి మాట్లాడుతూ..ప్రభుత్వ హాస్టల్లో ఉంటూనవోదయ విద్యాలయంలో చదువుకున్న తాను తన మిత్రులను కలిసి రిలయబుల్ ట్రస్టును స్థాపించామని,ఏళ్లుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అనాధ బాలలకు సేవలందిస్తున్నామని తెలిపారుఈ కార్యక్రమాలకు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు హనుమంతు, కే. ఉదయ అధ్యక్షత వహించారు.ఎంఈఓ జి. శ్రీనివాస్, సర్పంచులు గజం అనిత, లోడే రఘు, జడ్పీ ఉన్నత పాఠశాలల రమాదేవి, రఘుమారెడ్డి,అశోక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఆకట్టుకున్నారు.



## చార్టర్ డే సందర్భంగా విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

కాప్రా, వార్తా మిర్రర్ ,జులై 1 : లయన్స్ జిల్లా 324 హెచ్ చార్టర్ డే వేడుకల సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ కుషాయిగూడ ఆధ్వర్యంలో బుధవారం సౌత్ కమలనగర్ ప్రభుత్వ ఎం.పి.యు.పి. పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కుషాయిగూడ లయన్స్ ట్రస్ట్ హాస్పిటల్ చైర్మన్ లయన్ కొత్త రామారావు, జిల్లా కార్యదర్శి (గ్లోబల్ కాజెస్) లయన్ కొత్తపల్లి రాంబాబు, క్లబ్ అధ్యక్షుడు లయన్ తారకేశ్వరరావు, క్లబ్ కార్యదర్శి లయన్ వెంకట రామరాజు, కోశాధికారి లయన్ మోహన్, సీనియర్ సభ్యులు లయన్ చంద్రశేఖర్, లయన్ రవిశంకర్ రాజు, లయన్ పెద్ది శ్రీనివాస్, లయన్ అంజనీ కుమార్, లయన్ శ్రావణ్, లయన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.ఈ సేవా కార్యక్రమానికి ఆర్థిక సహకారం అందించిన వైఆర్‌పీ ఫౌండేషన్ చైర్మన్ రవి ప్రసాద్, కార్యక్రమానికి సహకారం అందించిన తక్షణ పూర్వ జిల్లా గవర్నర్ లయన్ గంప నాగేశ్వరరావులకు కృతజ్ఞతలు తెలిపారు.సమాజ సేవే లక్ష్యంగా లయన్స్ సంస్థ ఇలాంటి సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు.



## అంగన్వాడీ పిల్లలకు ఏకరూప దుస్తుల పంపిణీ

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జులై 2జగిత్యాల జిల్లా రాయికల్ మండలం వడ్డెర కాలనీ (శివాజీ నగర్) గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో గురువారం రోజున అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్ బోదాసు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మూడు నుండి ఆరు సంవత్సరాల పిల్లలకు యూనిఫామ్ లు పంపిణీ చేశారు.. ఈ సందర్భంగా సర్పంచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ అంగన్వాడి విద్య పిల్లల పట్ల పునాదిగా ఉంటుందని, ప్రైవేట్ స్కూల్ల లో పిల్లలకు విద్య మెదడుపై భారం పడి పిల్లల ఎదుగుదలను అనుచుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అమీర్, వార్డు సభ్యులు మాధురి మురళి, ప్రధానోపాధ్యాయులు మోహన్ రెడ్డి, అంగన్వాడి టీచర్ బియ్యని సుజాత, కారోబార్ జలంధర్, తల్లులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.



## కుమ్మర శాలివాహన కుల సంఘము ఆధ్వర్యంలో ఘనంగా పోచమ్మ బోనాలు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జులై 2ఆషాడ మాసం ప్రారంభోత్సవం సందర్భంగా జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణకేంద్రంలోగురువారం శ్రీ పెద్దపోచమ్మ తల్లి బోనాల వేడుకలు భక్తిశ్రద్ధలతో కుమ్మర శాలివాహన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామ దేవత అయిన పెద్దపోచమ్మ తల్లి ఆలయానికి సంఘం సభ్యులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ముక్కోటి దేవతలకు ముందుగా పోచమ్మ అనే స్థానిక ఆచారాన్ని అనుసరిస్తూ గ్రామస్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. బెల్లం నైవేద్యం తో కూడిన బోనాలను తలపై మోసుకుంటు ,గొర్రెపోట్లతో, కల్లు, సాకలతో ఆలయానికి చేరుకున్నారు. పసుపు, కుంకుమ, చీరెలు, సారెలు, నైవేద్యాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలు, పంటలు, పశు సంపదకు ఎలాంటి ఆపదలు రాకుండా పెద్ద పోచమ్మ తల్లి కాపాడాలని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజలందరినీ సుభిక్షంగా ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని పోచమ్మ తల్లిని వేడుకున్నారు .ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కొత్త పెల్లి గంగారాం, ప్రధాన కార్యదర్శి గంగాధరి సురేష్, కోశాధికారి కొత్త పెల్లి గంగాధర్, సంయుక్త కార్యదర్శి తుంపెట రాజేష్, కార్యవర్గ సభ్యులు గంగాధరి రాజేశం, కొత్త పెల్లి చిన్న గంగారాం, గంగాధరి గంగాధర్, సంఘ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ అరుణాచలేశ్వర ఆలయ ముఖద్వారం ప్రారంభం

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూలై 02 :-మహేశ్వరం నియోజకవర్గం మీర్ పేట్ లోని నందిహిల్స్ కాలనీ రోడ్ నెంబర్ 9 లో నిర్మించిన శ్రీ అరుణాచలేశ్వర ఆలయ ముఖ ద్వారంనకు గురువారం నాడు ఉదయం గం. 5:40 నిమిషాలకు ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో టెంపుల్ కమిటీ చైర్మన్ పి. విజయ్ కుమార్ టెంపుల్ ముఖద్వారానికి ప్రారంభోత్సవం చేశారు. ఈ టెంపుల్ ఆర్చ్ కి నందిహిల్స్ వాస్తవ్యులు టి. రంగారావు దంపతులు, పి. లక్ష్మీనారాయణ దంపతులు,దాతలుగా నిలిచారు ఇట్టి ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యుల వినతిని మన్నించి, అసోసియేషన్స్ ప్రెసిడెంట్స్, కార్యదర్శులు కాలనీలోని నాయకులు విజయ్ కుమార్, చంద్రశేఖర్ రెడ్డి, తన్నీరు రంగారావు దంపతులు, లక్ష్మీనారాయణ దంపతులు, చల్లా సురేందర్ రెడ్డి, రామిడి నర్సిరెడ్డి తదితర భక్తమహాషయులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం గావించారు. కార్యక్రమం అనంతరం, భక్తులందరూ శ్రీ అరుణాచలేశ్వర స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతిఒక్కరికి, ఆలయ కమిటీ మనసారా కృతజ్ఞతలు తెలియజేశారు

# అమృత్ 2.0 అభివృద్ధి పనులను పరిశీలించిన స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జూలై 2

జగిత్యాల జిల్లా రాయికల్ మున్సిపాలిటీలో కొనసాగుతున్న అమృత్ 2.0 అభివృద్ధి పనులను అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీ) శ్రీ బి. రాజగౌడ్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు అభివృద్ధి పనులను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్, చిల్డ్రన్స్ పార్కును సందర్శించి అక్కడ జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించారు. పార్కు అభివృద్ధి పనులు నిర్దేశిత వేగంతో కొనసాగకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, పనులు ఆలస్యం చేసిన సంబంధిత కాంట్రాక్టర్‌కు వెంటనే నోటీసులు జారీ చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం రాయికల్ మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి పట్టణంలో కొనసాగుతున్న ఇతర అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు, లబ్ధిదారుల ఎంపిక, నిర్మాణ పనుల పురోగతిపై వివరాలు తెలుసుకుని సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పారదర్శకంగా, వేగవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాయికల్



మున్సిపల్ చైర్మన్ శ్రీ కట్కం రవీందర్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, పట్టణ ప్రజలు, మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల హక్కుల కోసం బీసీ జేఏసీ పోరాటం

కల్వకుర్తి, జూలై 2 వార్త మిర్రర్ ప్రతినిధి:-

రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం, బీసీ జేఏసీ పిలుపు మేరకు కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో గురువారం బీసీ సంఘాల ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ, విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయడంతో పాటు జీవో నెం.7ను వెంటనే ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫీజు బకాయిలు పేరుకుపోవడంతో కళాశాలలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం వల్ల ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే స్కాలర్‌షిప్‌లు సకాలంలో అందక పేద విద్యార్థులు చదువులను మధ్యలోనే నిలిపివేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా పెండింగ్ బకాయిలను విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని కోరారు. రాష్ట్రంలో మెగా డీఎస్సీ నిర్వహించడం, గురుకుల పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించడం, విద్యాశాఖ మంత్రిని నియమించి విద్యావ్యవస్థను బలోపేతం చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సబ్‌ప్లాన్ సాధన సమితి అధ్యక్షుడు మేకల రాజేందర్, బీసీ సంక్షేమ




సంఘం అధ్యక్షుడు గొడుగు భాను చందర్, సురేష్ మోడీ, దారమోని గణేష్, ఇస్లావత్ శివ నాయక్, శ్రీకాంత్, నవీన్, బి. శివ, సామ్రాట్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాలనీలో బాంక్వెట్ హాల్ కలకలం

### శబ్ద కాలుష్యం, ట్రాఫిక్ సమస్యలతో స్థానికుల ఆందోళన.. అధికారుల జోక్యం కోరిన నివాసితులు



సికింద్రాబాద్, వార్త మిర్రర్ జులై 2: శాంతినగర్ చౌరస్తా సమీపంలోని నివాస ప్రాంతంలో నిర్వహిస్తున్న లావిష్ బాంక్వెట్ హాల్ కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నివాస ప్రాంతాల మధ్య వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించడంలో అమలులో ఉన్న నిబంధనలను పాటించడం లేదని వారు ఆరోపిస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం, వివాహాలు, శుభకార్యాల సందర్భంగా అర్ధరాత్రి వరకు అధిక శబ్దంతో డీజేలు, సౌండ్ సిస్టమ్‌లు వినియోగించడం వల్ల చిన్నారులు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. శబ్ద కాలుష్యంతో పాటు ఫంక్షన్ హాల్‌కు వచ్చే వాహనాల రాకపోకల కారణంగా కాలనీలో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. పార్కింగ్‌కు తగిన స్థలం లేకపోవడంతో అతిథులు నివాసాల ముందు వాహనాలు నిలిపివేస్తుండటంతో స్థానికులు తమ ఇళ్ల నుంచి బయటకు రావడానికే ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. అదనంగా, ఫంక్షన్ హాల్ నుంచి వెలువడే తడి, పొడి వ్యర్థాలను డ్రైనేజీల్లో వేస్తున్నారని, దీంతో మురుగు కాలువలు మూసుకుపోయి దుర్వాసన, దోమల బెడద పెరుగుతోందని ఆరోపించారు. ఫైర్ సేఫ్టీ, కాలుష్య నియంత్రణ, పార్కింగ్ తదితర నిబంధనలు పూర్తిగా అమలవుతున్నాయా అనే అంశంపై సంబంధిత శాఖలు సమగ్రంగా తనిఖీలు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. నివాస ప్రాంత ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించినట్లయితే చట్టపరమైన చర్యలు చేపట్టాలని మున్సిపల్, అగ్నిమాపక, కాలుష్య నియంత్రణ, పోలీసు శాఖ అధికారులను వారు విజ్ఞప్తి చేశారు. అయితే, స్థానికులు చేసిన ఆరోపణలపై లావిష్ బాంక్వెట్ హాల్ యాజమాన్యం స్పందన తెలియాల్సి ఉంది.



## ఖాళీ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేయాలి: ఉస్మానియా విద్యార్థి సంఘాలు

సికింద్రాబాద్, వార్త మిర్రర్ జూలై 2 : రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి వెంటనే నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్మనబోయిన సైదులు యాదవ్ నాయకత్వంలో విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ, ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రకటించినప్పటికీ ఇప్పటికీ ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం నిరుద్యోగ యువతను నిరాశకు గురిచేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 25 వేల పోలీసు ఉద్యోగాలకు వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని, డీఎస్సీ నియామక ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేసి పేద విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని కోరారు. విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర పోస్టులను భర్తీ చేయాలని, ఐటీడీఏ ప్రాంతాలకు ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలని, యూపీఎస్సీ తరహాలో ప్రతి సంవత్సరం ఉద్యోగాల వార్షిక క్యాలెండర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. టీజీపీఎస్సీ ఛైర్మన్ రాజీనామా చేయాలని, 2023 కాంట్రాక్టు జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ లెక్చరర్ల క్రమబద్ధీకరణను రద్దు చేయాలని కూడా కోరారు. గురుకుల, సంక్షేమ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని




ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోతే ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని అన్ని విద్యార్థి సంఘాలతో కలిసి త్వరలో ఉమ్మడి కార్యాచరణ ప్రకటించి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోకల చిరంజీవి, బీఆర్ఎస్‌వీ విద్యార్థి నాయకుడు పవన్, జేవీఎస్ సంఘం అధ్యక్షుడు చీరల వంశీ, విద్యార్థి నాయకులు ప్రభాకర్, సాయికిరణ్, అరుణ్, మహేష్ యాదవ్, చిందం మధు, కుమార్, శివ తదితరులు పాల్గొన్నారు.

# చౌటుప్పల్ ఎంఈఓ కార్యాలయం ముట్టడి



వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జులై 02

అఖిలపక్ష విద్యార్థి, యువజనసంఘాల ఆధ్వర్యంలో గురువారం చౌటుప్పల్ మండల విద్యాధికారి కార్యాలయాన్ని ముట్టడించారు. విద్యార్థుల సమస్యలు, ప్రయివేట్ పాఠశాలల అక్రమాలు, ప్రభుత్వ నిబంధనల అమలుపై పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఎంఈఓ స్పందించకపోవడం, కార్యాలయ సమయంలో ప్రజలకు అందుబాటులో లేకపోవడం, బాధ్యతలను విస్మరించడం పట్ల తీవ్ర నిరసన వ్యక్తంచేశారు. నిరసనలో భాగంగా ఎంఈఓ కుర్చీని కార్యాలయం బయటకు తీసుకువచ్చి దానిపై ఎంఈఓ ఎక్కడ ? ప్రజలకు అందుబాటులో లేని అధికారి అనే సందేశాలతో వినూత్నంగా ఆందోళన నిర్వహించారు.



విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజా సమస్యలు వినాల్సిన అధికారి కార్యాలయంలో లేకపోవడం విద్యాశాఖ నిర్లక్ష్యానికి నిదర్శనమని నాయకులు విమర్శించారు. అనంతరం చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ప్రజలకు అందుబాటులో లేకుండా, విధులకు గైర్హాజరవుతున్న మండల విద్యాధికారి ఆచూకీ గుర్తించి తెలియజేయాలని కోరుతూ సీఐ మన్మథకుమార్‌కు పిటిషన్ సమర్పించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష విద్యార్థి, యువజనసంఘాల నాయకులు వీరమల్ల కార్తీక్‌గౌడ్, పల్లె మధుకృష్ణ, దిండు భాస్కర్, నలపరాజు రమేశ్, కొండూరు వెంకన్న, బండిగారి శ్రీధర్, పబ్బు వంశీ, తీగుళ్ల శ్రీను, ఒంటెద్దు లింగస్వామి, రాఘవ, కొప్పు రామకృష్ణ, కొల్లూరు నవీన్, అత్తు, చింటు, హరీశ్, ప్రవీణ్, ఇర్ఫాన్, రాకేశ్ పాల్గొన్నారు..

## భవిష్యత్తులో కాంగ్రెస్ బిఆర్ఎస్ కు ప్రజలె బుద్ధి చెప్తారు

### ---బిజెపి రాష్ట్ర కోఆపరేటివ్ సెల్ కన్వీనర్ కొలను శంకర్ రెడ్డి



వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూలై 02 :- తెలంగాణ రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియ చురుకు గా కొనసాగుతుంటే కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీ లు బుజాలు ఎందుకు తడుము కుంటున్నాయి అని బిజెపి రాష్ట్ర కోఆపరేటివ్ సెల్ కన్వీనర్ కొలను శంకర్ రెడ్డి వాపోయారు గురువారం ఆయన ప్రకటన విడుదల చేశారు ఇన్నాళ్లు బంగ్లాదేశ్, రోహింగ్యాల ఓట్లతో పాటు మజ్లిస్ తో చేతులు కలిపి డబల్, ట్రిబుల్ ఓట్లు నమోదుతో అధికారములో కొనసాగిస్తూ ఇప్పుడు దేశం సమాజం కోసం దేశ సురక్షిత పనులు చేస్తుంటే జీర్ణించుకోలేక బీజేపీ పై విషం చిమ్మడం ఎంతవరకు సమంజసం అని అన్నారు ప్రజలు అందరూ వీరి డ్రామాలను గమనిస్తునారని భవిష్యత్తులో కాంగ్రెస్, బి ఆర్ ఎస్ లకు బుద్ధిచెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు



## బీసీ బంద్ సంపూర్ణ విజయవంతం

### బీసీ యువజన సంఘం మండల అధ్యక్షుడు కొప్పు రామకృష్ణ

సంస్థాన్ నారాయణపూర్ జులై 02( వార్త మిర్రర్ )బీసీల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా ఇచ్చిన బీసీ బంద్ పిలుపునకు స్పందిస్తూ నారాయణపూర్ మండలంలో బంద్ సంపూర్ణంగా విజయవంతమైంది. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఇంటర్ కళాశాలలు పూర్తిగా బంద్ పాటించాయి. బంద్‌కు విద్యార్థులు, యువజనులు, బీసీ సంఘాల నాయకులు, ప్రజలు విశేషంగా సహకరించి విజయవంతం చేశారు. ఈ సందర్భంగా బీసీ యువజన సంఘం మండల అధ్యక్షుడు కొప్పు రామకృష్ణ మాట్లాడుతూ, బీసీల హక్కులు, సంక్షేమం, విద్యా అవకాశాల పరిరక్షణ కోసం చేపట్టిన ఈ బంద్‌కు ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు తెలపడం ఆనందదాకయమన్నారు. ప్రభుత్వం బీసీల సమస్యలను ఇకనైనా వెంటనే పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న డిమాండ్లను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా బీసీల న్యాయమైన డిమాండ్లపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని, లేకుంటే రానున్న రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బంద్‌ను విజయవంతం చేసిన విద్యార్థులు, యువజనులు, కళాశాలల యాజమాన్యాలు, ప్రజలకు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలోమండల యువజన సంఘం ఉపాధ్యక్షుడు కొల్లూరి నవీన్, బి జె పి జిల్లా నాయకులు సూరపెల్లి శివాజీ, బి.ఆర్.ఎస్ యువజన నాయకులు పానుగోతు తరుణ్ నాయక్ , రాసమల్ల .సంజయ్ , చెర్క. శేఖర్ చెర్క .యశ్వంత్ , చంద్రశేఖర్ వంగరి. సాయి తదితరులు పాల్గొన్నారు



## వర్షాలు కురవాలని క్రిష్ణగిరి పాదాల గుట్టపై క్రిష్ణ పాదాలకు అభిషేకం

శంకర్ పల్లి మున్సిపల్, (వార్త మిర్రర్)



జులై-2 : గత 20 రోజులుగా వర్షాలు కురవక పోవడంతో మొలకెత్తిన మొలకలు ఎండిపోయే దశకు రావడంతో రైతులు విలపిస్తున్నారు. అప్పులు చేసి విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేశాము, పంటలు పండకపోతే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ దిక్కు లేక పోతే ఆ దేవుడే దిక్కు అన్నట్లుగా గుబ్బడి పత్తెపురం లోని శ్రీ రాధాక్రిష్ణ ఆలయ క్షేత్రంలోని సనాతన కాలం నాటి క్రిష్ణగిరి పాదాల గుట్టపై ఉన్న క్రిష్ణ పాదాలకు గురువారం నాడు ఆ గ్రామస్తులతో పాటు మరకత శివలింగ నామకరణ భక్తుడు, శంకర్ పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు ఆర్.నరేష్ కుమార్ కూడా పాల్గొని వర్షాలు కురవాలని అభిషేకం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భూపతి రెడ్డి, జంగయ్య ముదిరాజ్, హరిశంకర్, ఆర్.రాజు తదితరులు పాల్గొన్నారు.



## ఫిర్యాదుల పై తక్షణమే స్పందించాలని ఎస్పీ ఆదేశం

### - రౌడీషీటర్ల పై నిరంతర నిఘా

### - జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ పాటిల్

కల్వకుర్తి, జూలై 2 వార్త మిర్రర్ ప్రతినిధి:-

నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీ డా. సంగ్రామ్ సింగ్ జి పాటిల్ (ఐపీఎస్) గురువారం కల్వకుర్తి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ నిర్వహణ, పరిశుభ్రతను పరిశీలించిన ఆయన, పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు మెరుగైన వాతావరణం కల్పిస్తూ ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించి, పారదర్శకంగా విచారణ జరిపి సత్వర న్యాయం అందించాలని అధికారులను ఆదేశించారు. డయల్-112 కాల్స్‌కు వెంటనే స్పందించాలని, రౌడీషీటర్ల కదలికలపై నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు. విలేజ్ పోలీస్ అధికారులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. అలాగే పెండింగ్ కేసులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎస్సై కురుమూర్తిని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ నిర్వహణ, రికార్డుల భద్రత, సిబ్బంది క్రమశిక్షణపై సంతృప్తి వ్యక్తం చేస్తూ సిబ్బందిని అభినందించారు.